# బలహీనత

-ఎస్.గాయత్రి

నారాయణమూర్తి బ్యాంక్ ఎంప్లాయీ. మనిషి మంచివాడే.

రోజూ పొద్దున్నే సంధ్యావార్చడం, పూజలు పునస్కారాలు అన్నీ ఉన్నాయి. వాటితో పాటూ చిన్న చిన్న వీక్‌నెస్‌లు కూడా ఉన్నాయి. అవి సాధారణంగా అందరి మొగాళ్లకి ఉన్నవే. ఆడవాళ్ళు కనబడితే అవసరం లేకపోయినా కల్పించుకుని మాట్లాడడం, చేతివేళ్ళ నుంచి ఏ భాగమైనా తగుల్తుందేమోనని ట్రై చేయడం, బూతు జోకులు...ఇవన్నీ ఆఫీస్‌లో మాత్రమే!

ఇంట్లో రాముడిలా కనబడతాడు. చక్కని భార్య, కూతురు, కొడుకు.

చాలాసార్లు ఫ్రెండ్స్ ఎగతాళి చేశారు కూడా"నువ్వేమైనా కాలేజీ కుర్రాడివా ఏంటి డిగ్రీ చదువుతున్న కొడుకు, ఇంటర్‌కి వచ్చిన కూతురు ఉన్నారు. అవేం బుద్ధులు!" అని.

"దేని దారి దానిదే వయస్సు పోతే మళ్ళీ రాదు" అని నవ్వేసేవాడు.

★ ★ ★

ఒకరోజు ఆఫీసు నుంచి వచ్చేసరికి కూతురు సుధ తల్లితో ఏడుస్తూ ఏదో చెప్తోంది.

తను రావడం చూసి అందరూ సైలెంట్ అయిపోయారు. ఆ తర్వాత భార్యని అడిగాడు "ఎందుకు అది ఏడుస్తోంది?"అని.

"ఏముంది మామూలే బస్సులో కదా వెళ్ళేది కాళ్ళు తగిలించేవాళ్ళు, చేతులు తగిలించేవాళ్ళు, తోపుళ్ళు, నెట్టుళ్ళు అవన్నీ చీదరగా ఉన్నాయిట. బండి కొనివ్వండి లేకపోతే ఆటో మాట్లాడమంటోంది"

"ఇట్లాంటి వికృతచేష్టలు చెయ్యడానికి వీళ్లకి అక్కాచెల్లెళ్ళు ఉండరేమో" భార్య చీత్కారానికి నారాయణమూర్తి మొహంలో నెత్తురు చుక్కలేదు. దానికి తోడు మర్నాడు కొడుకు వచ్చి "నాన్నా, నాకు డిగ్రీ అయ్యాక బండి కొంటానన్నావు కదా బండి నాకు వద్దు చెల్లికి కొనివ్వండి" అని చెల్లి పరిస్థితిని అర్థం చేసుకున్న అన్నగారిలా తనవంతు సిఫారసు చేశాడు.

మర్నాడే సుధకి బండి కొనిపెట్టాడు నారాయణమూర్తి.

కనీసం ఇప్పటికైనా అతనిలో మార్పు వస్తుందని ఆశిద్దాం.

తనదాకా వస్తేగానీ తెలీదు అంటారు కదా ఇలాంటి చిన్న చిన్న బలహీనతల వల్ల ఉన్న మంచి పేరుని ఎందుకు పోగొట్టుకుంటారో వాళ్లకే తెలియాలి.

★

